సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

హత్నూర, మార్చి18: మండలంలోని తాహెర్కాన్ పేట, తుర్కలఖానాపూర్‌లోని సాయిబాబా ఆలయ ఏడో వార్షికోత్సన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి కాకడహారతి, సుప్రభాత సేవ, అభిషేకం, సాయిస్తోత్రం, భజన పాటలు, మంగళహారతి, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులుతోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి

అందోల్, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని వైద్యారోగ్య, సైన్స్, టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి అధ్యక్షతన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని ప్రచారం చేపట్టాలని సూచించారు. అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. సమావేశంలో బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, మాజీమంత్రి చంద్రశేఖర్, మాజీఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి, పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

ఎంబీబీఎస్ విద్యార్థికి చేయూత

కొండాపూర్, మార్చి 18: మండలంలోని గిర్మాపూర్ గురుకుల కళాశాలలో చదువుకొని ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి బేగరి ప్రవీణ్‌కుమార్‌కు గురుకుల అధ్యాపకులు రూ. 17వేలు అందజేశారు. అతడి ఆర్థిక పరిస్థితులు బాగాలేక చదువు మధ్యలోనే ఆగిపోయే విషయాన్ని తెలుసుకున్న టీచర్లు కొంత ఆర్థికసాయాన్ని అందజేశారు. విద్యార్థి చదువు కోసం ఎవరైనా కొంత ఆర్థికసాయం అందివ్వాలని కోరుతున్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ సుదర్శన్, టీచర్లు కహెరత్ అలీ, పీడీ లాలూ, బాలకృష్ణయ్య, దిలీప్, ఎం.రాజు, రుప్‌సింగ్, నరేశ్, రామకోటయ్య, త్రిజ, ఆంజనేయులు, రాకేశ్, శ్రీనివాస్, వెంకట్, పవన్, శ్రీనివాస్, వెన్నెల, స్వేతాజెనదిన్ ఉన్నారు.



విద్యార్థి బేగరి ప్రవీణ్‌కుమార్‌కు చేయుతనిస్తున్న గురుకుల టీచర్లు

ఘనంగా మల్లన్న జాతర

జిన్నారం, మార్చి 18 : జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెంలో మల్లన్న ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాగవెల్లి నిర్వహించారు. మల్లన్న చరిత్రను ఒగ్గు కథారూపంలో కళాకారులు తెలిపారు. పెద్దమ్మగూడెం గ్రామస్తులతోపాటు జిన్నారం, జంగంపేట చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. మంగళవారం రేణుకాఎల్లమ్మకు బోనాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మల్లికార్జునస్వామి కల్యాణం

గుమ్మడిదల, మార్చి 19 : మండల కేంద్రంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వాహకులు భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం బండ్ల ఊరేగింపు, బోనాలు తీశారు. పలు పార్టీల నాయకులు, భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

పోషణ్ పక్వాడపై అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 18: మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మహిళా ప్రాంగణంలో పూర్వ ప్రాథమిక విద్యను బొమ్మల రూపంలో ఎలా నేర్పించవచ్చని తెలియజేసేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారి లలితాకుమారి మాట్లాడుతూ బాల్యరంభ విద్య లెర్నింగ్ కార్నర్‌లను ప్రతి సెంటర్‌లో ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలు నిర్వహిస్తూ గర్భిణులకు, పిల్లల తల్లిదండ్రులకు తగిన సూచనలు ఇవ్వాలని, పంచ సూత్రాలపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో రేణుక, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, సహాయ సమన్వయ కర్త నవీన్‌కుమార్, సుపర్‌వైజర్ జయలక్ష్మి, అజీం ప్రేమ్ జీ సిబ్బంది, గర్భిణులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం చేస్తున్న మహిళా, శిశు సంక్షేమాధికారి లలితాకుమారి

మైనార్టీల సంక్షేమానికి కృషి

బొల్లారం, మార్చి 18: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోలన్ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న మసీద్ స్లాబ్ నిర్మాణ పనులను ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రారంభించారు. అనంతరం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. మసీద్ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ ప్రతినిధులు మాజీ ఎంపీపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రత్నం, శభాష్, ఖలీల్, రియాజ్, మౌలానా ముష్తీ, ఆజాం, అల్తాఫ్ పాల్గొన్నారు.



సంగారెడ్డి : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

బొల్లారం : హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

కోహీర్ : రంజోల్ గురుకుల పాఠశాల్లో వద్ద..

సజావుగా పది పరీక్షలు

- మొదటిరోజు 99.82శాతం హాజరు నమోదు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 18: పదోతరగతి పరీక్షలు సోమవారం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 22,029 మంది విద్యార్థులకు 21,990మంది పరీక్షకు హాజరయ్యారు. దీంతో 99.82శాతం హాజరు నమోదైంది. ఉదయం 9.30గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగింది. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. తొలిరోజు తెలుగుభాషా పరీక్ష సజావుగా జరిగింది. ఎస్పీ చెన్నూరి రూపేశ్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి సంగారెడ్డి లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరిశీలకుడు, మెదక్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శివ రమేశ్ బాబు 6 కేంద్రాలు, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు 8కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 33 కేంద్రాలు, మొత్తం 49 పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను పరీక్షాకేంద్రాల్లో ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఎవరికీ పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లేందుకు అనుమతులు లేవని తెలిపారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడా ఏ ఒక్క విద్యార్థి కూడా డిబార్ కాలేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నదని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు.. పరీక్షా కేంద్రాల వద్ద జీరాక్స్ కేంద్రాలను ముందస్తుగా మూసివేయించామన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే 100కి, లేనిపక్షంలో సమీప పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దేవదాసు, విద్యాశాఖ అధికారులు భాస్కర్ ఉన్నారు.

సంగారెడ్డి : విజయ సంకేతం చూపుతున్న విద్యార్థినులు

సంగారెడ్డి : నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

సంగారెడ్డి : పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు

అకాల వర్షం.. అపార నష్టం

ఝరాసంగం, మార్చి 18 : మండలంలో రెండురోజులుగా ఈదురుగాలులతో కురుస్తున్న వర్షానికి చేతికొచ్చిన పంటలు పూర్తిగా నేలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుప్పానగర్‌లో రైతు రాంపూర్ మాణయ్య రెండెకరాల్లో జొన్న, మొక్కజొన్న పంటలను సాగు చేశాడు. రెండెకరాలకు సుమారు రూ.80వేల వరకు పెట్టుబడి అయ్యిందని తెలిపారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు. వనంపల్లి, భోజ్యనాయక్ తండా, పూర్యనాయక్ తండా, సిద్ధాపూర్ గ్రామాల్లో సాగు చేసిన పంటలు నేలమట్టం కావడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి, తమకు ఆదుకోవాలని రైతు లు డిమాండ్ చేస్తున్నారు.

నేలకొరిగిన జొన్నపంటలో రైతు మాణయ్య

జాతీయ సమైఖ్యతా శిబిరంలో తారా విద్యార్థి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 18: జాతీయ సమైఖ్యతా శిబిరంలో తారా కళాశాల విద్యార్థిని పాల్గొనడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హరియానాలోని ఫరహాబాద్‌లో ఈనెల 12 నుంచి 18 వరకు జరిగిన జాతీయ సమైఖ్యతా శిబిరంలో కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న సింధు పాల్గొన్నదన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలైన బోనాలు, బతుకమ్మ వంటి కార్యక్రమాలను ప్రదర్శించి రాష్ట్ర ఔన్యత్యాన్ని చాటిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంపికైన సింధును ఆయన అభినందించారు. విద్యార్థిని అభినందించిన వారిలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

గుమ్మడిదల, మార్చి 18: వివాహిత అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..గుమ్మడిదలకు చెందిన పుదరి నర్సింహులుకు 14 ఏండ్ల క్రితం మాధవి(30)తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. మాధవి ఇంటి వద్దనే గృహిణిగా ఉంటుంది. ఈనెల 16న మాధవి మల్లారెడ్డి దవాఖానకు సూరారం వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రం భర్త ఫోన్ చేస్తే మాధవి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద వెతికినా సమాచారం లేదు. దీంతో పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అదృశ్యంపై దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలను అరికట్టాలి

హత్నూర, మార్చి18: బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలను అరికట్టాలని హత్నూర మండలం పన్యాల, బడంపేట గ్రామాల మహిళలు సోమవారం హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గ్రామాల్లో కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలు చేపట్టడంతో కుటుంబాల్లో గొడవలు తలెత్తుతున్నాయన్నారు. మద్యం తాగొచ్చి డబ్బుల కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నారని, డబ్బులు ఇవ్వకపోతే ఇంట్లోని సామగ్రిని అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగిన మైకంలో దాడి చేసి గాయపరుస్తున్నట్లు తెలిపారు. బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలను నిషేధించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యశోధక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మకాలను అరికట్టాలని ఎస్ఐ సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

పోలీస్‌లతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు

కోహీర్, మార్చి18: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. సోమవారం జహీరాబాద్ మహీంద్ర పరిశ్రమ ఆవరణలో తెలంగాణ, కర్ణాటకలోని బీదర్, ఉస్మానాబాద్, చించోలి పోలీస్‌స్టేషన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ వాహనాల తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం రవాణాను అరికట్టాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు పోలీసులందరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ, కర్ణాటక సీఐలు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రాయికోడ్, మార్చి 18 : గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నామని జహీరాబాద్ రూరల్ సీఐ ఎండీ నహీమొద్దీన్ అన్నారు. సోమవారం రాయికోడ్, సింగీతం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోకసభ ఎన్నికలకు ప్రజలు సహకరించి, ఎన్నికల నిబంధనలను తూచాతప్పకుండా పాటించాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నందు వల్ల గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. డబ్బు, మద్యం రవాణా చేయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పరిమితికి మించి డబ్బులను తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. అనంతరం రాయికోడ్‌లో పదోతరగతి పరీక్ష కేంద్రాల పనితీరును ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ ఎక్బాల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నగదు స్వాధీనం

కల్హేర్, మార్చి 18: వాహనాల తనిఖీలో రూ.2.80లక్షలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశం తెలిపారు. సోమవారం కల్హేర్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా మాసాన్‌పల్లికి చెందిన చినూరీ కుబేర్‌కుమార్ ఆధారాలు లేకుండా రూ. 2.80లక్షల నగదును స్కూటీలో తీసుకెళ్తున్నారని, వాహనాన్ని తనిఖీ చేయడంతో నగదు లభ్యమైందన్నారు. నగదును స్వాధీనం చేసుకొని సంగారెడ్డిలోని గ్రీవెన్స్ కమిటీకి పంపించామని ఎస్ఐ తెలిపారు.

స్కూటీలోని నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ వెంకటేశం

క్రీడాకారులకు సన్మానం

రామచంద్రాపురం, మార్చి 18: జాతీయ స్థాయి బాక్సింగ్, కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన హర్షవర్ధన్, కారుణ్యలను స్థానిక నాయకులు, బస్తీవాసులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఈస్టర్న్ ఓపెన్ టాలెంట్ హంట్ బాక్సింగ్‌లో ఆర్సీపురానికి చెందిన హర్షవర్ధన్ అద్భుతమైన ప్రతిభను కనబర్చి ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. జాతీయస్థాయిలో జరిగిన కుస్తీ పోటీల్లో ఆర్సీపురానికి చెందిన కారుణ్య ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆర్సీపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ సింగ్, నాయకుడు నగేశ్, బస్తీవాసులు క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు. బాక్సింగ్, కుస్తీ పోటీల్లో రాణించి అంతర్జాతీయస్థాయికి ఎదగాలని, సహకారం అందజేస్తామని వారు తెలిపారు.

క్రీడాకారులను సన్మానిస్తున్న నాయకులు

పంటల పరిశీలన

సిర్గాపూర్, మార్చి 18: మండలంలోని వాసర్ గ్రామాన్ని క్లస్టర్ ఏఈవో శ్వేత సోమవారం సందర్శించారు. గ్రామంలో వర్షం, ఈదురు గాలులకు నెలకొరిగిన పంటలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడక్కడ పంటలు గాలికి అడ్డంపడినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆమె వెంట రైతులు ఉన్నారు.

జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో శ్వేత

నేడు వీడియోకాన్ఫరెన్స్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 18: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10 నుంచి 11.30 వరకు రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో భాగంగా జగిత్యాల నుంచి డాక్టర్ శ్రీనివాస్ వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. కొండా లక్ష్మణ్ ఉద్యాన వన డీన్, డాక్టర్ రాజశేఖర్ ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తార న్నారు. జిల్లాలోని కొండాపూర్, సిర్గాపూర్, డాకూర్ అల్లిపూర్, సోలక్‌పల్లి రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించి సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

నేడు మండల సభ

సిర్గాపూర్, మార్చి 18 : సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలసభ నిర్వహిస్తామని ఎంపీడీవో మల్సూర్ సోమవారం తెలిపారు. ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జడ్పీటీసీ రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. మధ్యాహ్నం 2గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

చైర్మన్‌ను భర్తీ చేయాలి

హత్నూర, మార్చి18: మత్స్యకారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింహులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌ను నామినేట్ చేయకుండా, 33జిల్లాల అధ్యక్షులతో ఎన్నిక నిర్వహించి అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిని కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్లు రమేశ్, నాగరాజు, హనుమంతు, ఆగమయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కోహీర్, మార్చి 18 : మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయ రెనోవేషన్ కమిటీ ఏర్పాటు కోసం ఆసక్తి ఉన్న భక్తులు ఆరురోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 14మందితో ఏర్పాటు చేసిన ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుల పదవీకాలం సోమవారంతో ముగిసిందన్నారు. దీంతో కొత్తగా ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి తమవంతు పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను తనకు గానీ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు అందజేయాలని కోరారు.

రోడ్డు పనుల పరిశీలన

జిన్నారం, మార్చి 18 : జిన్నారంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ లావణ్యానరేశ్ సోమవారం పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం గ్రామంలో అంతర్గత రోడ్లను సీసీలుగా మారుస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీలోని పెద్దమ్మగూడెం, నర్రెగూడెంలలో కూడా సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. జిన్నారం గ్రామ పంచాయతీ అభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా పని చేస్తున్నామని చెప్పారు. పరిశీలించిన వారిలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, కోటేశ్, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, మల్లేశ్‌యాదవ్, నర్సింహులు, శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ పనులు పరిశీలిస్తున్న నాయకులు

యువకుల ఘర్షణ

కంది, మార్చి 18 : తాగిన మైకంలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన కంది మండలం ఇంద్రకరణ్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం బతుకుదెరువు కోసం బీహార్ నుంచి వచ్చిన ముగ్గురు యువకులు రోషన్, అంకిత్, అశోక్‌కుమార్ యాదవ్ ఇంద్రకరణ్ పరిధిలోని ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నారు. వీరు ఇక్కడే ఒక ఇంటిపై అద్దెకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ముగ్గురు రూంలో మద్యం తాగారు. అనంతరం ఓ విషయంలో అంకిత్, రోషన్ గొడవపడ్డారు. మాటామాట పెరిగి ఆవేశంలో అంకిత్ రోషన్‌ను ఇంటి పైనుంచి కిందకు తోసేశాడు. బిల్డింగ్‌పై నుంచి పడిన రోషన్(21) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న అశోక్‌కుమార్ యాదవ్ ఇంటి యజమాని కిష్టయ్యకు చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంకిత్ అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.